కథానిక

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక

# వంటింట్లో నులక మంచం



డా. గీతాంజలి

స్టౌ మీద టీ డికాషన్ సలసల కాగుతోంది. సరళ మనసూ సలసల కాగుతోంది. సరళకు బాధగా వుంది. కోపంగా వుంది. అన్నింటికీ మించి అసహ్యంగానూ వుంది. వీటన్నింటికీ మించి భయంకరమైన నీర్సంగా వుంది, శోష వచ్చి పడిపోతున్నట్టుగా వుంది.

సరళకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. రెండు వారాలైంది. మూడోవారం నిన్నటితో మొదలౌతుంది. ఇంకా మందులు వాడుతూనే వుంది. మొన్నటి దాకా అత్త సణుక్కుంటూనే చేసింది. నిన్నట్నించీ మూల్గటం మొదలెట్టింది. చాకిరీ చేసి చేసి అత్తకు ఒళ్ళంతా సలువుతున్నట్టు జ్వరం ఒచ్చేసినట్టుగా వుందట. ఒకటే గొణుగుతోంది.

పొద్దున్నే సరళ భర్త సురేష్ సరళ నుదుటిపైన చేయివేసి "జ్వరం అస్సలు లేదు. ఇంక లేచి పనులు చేసుకో.. అమ్మకి కష్టంగా వుంది" అన్నాడు.

"జ్వరం ఎందుకు లేదండీ? మాత్ర వేస్కోకపోతే నూరు డిగ్రీలు చూపిస్తోంది. కళ్ళు తిరుగుతున్నాయి. నీర్సంగా వుంది. ఇంకో నాలుగు రోజులు విశ్రాంతి తీస్కుంటాను. డాక్టర్ కూడా చెప్పింది... అప్పటికీ కూరలూ అవీ తరిగిస్తున్నాను కదా... మీ చెల్లెలు ఉమ వుందిగా... ఆమెని చెయ్యమనండి" సరళ నీర్సంగా అంది.

"చాల్లే... ఉమకి ఏవో పరీక్షలు... అయినా అది పనిచేయడం ఏమిటి? ఇన్ని రోజులు విశ్రాంతి తీస్కుంటే చేసేవాళ్ళకీ విసుగొస్తుంది, ఏదో మెల్లమెల్లగా చేస్కుంటే ఆరోగ్యం దానికదే కుదుట పడుతుంది లే! లేచి టీ పెట్టు ఫో. అమ్మ ఒక్కత్తే అవస్థ పడుతోంది" సురేష్ విసుగ్గా అన్నాడు.

సరళకి కోపం వచ్చింది "అంటే... జ్వరంలో కూడా నేను మీకందరికీ సేవలు చేయాలన్న మాట! మామూలు రోజుల్లో అయితే గొడ్డులా చేయించుకుంటూనే వున్నారుగా! కనీసం జ్వరం వచ్చినపుడైనా విశ్రాంతి లేదా? ఎలా చెయ్యగలననుకుంటున్నారు? ఈ స్థితిలో మీరూ, మీ అమ్మా, చెల్లీ, తమ్ముడూ వుంటే కాలు కింద పెట్టరు కదా.. నేను మాత్రం ఇంకా పూర్తిగా తేరుకోకముందే మీ అందర్కీ, చెయ్యడం ప్రారంభించాలి. పోయినేడాది మలేరియా వచ్చినప్పుడూ ఇంతే... నేను చెయ్యను, నావల్ల కావటం లేదు...




## మనిషికీ మనిషికీ మధ్య ఉండాల్సిన మానవత్వపు రేఖలు కూడా ఎందుకు చెరిగిపోతున్నాయి.

సరళ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి...

"చెయ్యక? ఎవరున్నారు నీకిక్కడ చెయ్యడానికి నీవేం మహారాణివి కావు" సురేష్ వ్యంగ్యంగా అన్నాడు.

"ఎవరెందుకు లేరు? మీ అమ్మ, మీ చెల్లి, మీరు, మీ తమ్ముడు, మామయ్య? మీరంతా జలుబుక్కూడా మంచాలెక్కి నాతో చేయించుకుంటున్నప్పుడు... న్నాకెందుకు చెయ్యరు? నాకు బాగో లేకపోతే.. నాకు చెయ్యడం మానె... కనీసం మీ పనులు మీరైనా చేస్కోవచ్చుగా ఈ స్థితిలో కూడా మీకు చాకిరీ చెయ్యడానికి నేనేం మీ కట్టుబానిసని కాను" సరళ కోపంగా అంది.

"రోజు రోజుకీ వాదన ఎక్కువైపోతోంది. అమ్మ పొద్దున్న మూలుగుతోంది... పెద్ద మనిషి.. ఎన్నిసార్లు చెప్పాలి? లే! నాకాఫీనుకు టైం అవుతోంది" సురేష్ విసురుగా స్నానానికి వెళ్ళిపోయాడు.

వంటింట్లోకొచ్చిన కోడల్ని చూసి శకుంతలమ్మ ముఖం వికసించింది. "టీకి నీళ్ళు పడేశాను. చూడు! ఏంటోనమ్మా ఈ ఒళ్ళునొప్పులు నిలువనిస్తలేవు" అని రాని మూల్గుకొసని సాగదీస్తూ... వంటింట్లోంచి వెళ్ళిపోయింది. సరళకు తెలుసు ఆమె మరిక వంటింట్లోకి రాదని.

మరుగుతున్న డికాషన్‌లో పాలు పోసింది సరళ... ఈ లోపల పనిమనిషి రాధ వచ్చింది. అంట్లు ముందేస్కుని తోముతోంది. రాధ! పంతొమ్మిదేళ్ళుంటాయి. ప్రసవించి మూణ్ణెల్లే అయ్యింది. నిన్ననే మళ్ళీ పన్లో చేరింది.

సరళ గ్లాసుల్లో టీ పోసి, అందర్కీ ఇచ్చింది. ఆడపడుచు ఉమ, మరిది రవి ఇంకా నిద్రపోతున్నారు. వాళ్ళకి మళ్ళీ చేసివ్వాలి... ఈ ఇంట్లో అంతా ఒక్కసారి లెగరు! అదీ ఒక్కచోట అస్సలు తాగరు. ఒకరు డ్రాయింగ్ రూంలో, ఒకరు బెడ్రూంలో, ఒకరు పెరట్లో, మామగారు బాల్కనీలో... సరళ విసుక్కుంటూ తనకింత గ్లాసులో పోస్కుని, రాధకీ ఇచ్చింది. తాను అరుగుమీద కూలబడింది.

'పచ్చి బాలింతెవి.. ఇంకో మూణ్ణేళ్ళు ఇంట్లోనే వుండక పోయినావా..' రాధని సరళ అడిగింది.

రాధ నవ్వింది 'ఇంట్లో కూర్చుంటే అయితాదమ్మ మా యత్త.. మా ఇంటికొచ్చి నన్ను తోల్కొచ్చింది. మా అమ్మ ఇంకో మూణ్ణెల్లదాకా పన్లకు పంపదన్నది కానీ ఈమే పంపుతున్నది. మా ఆడుబిడ్డ లగ్గం వచ్చే సంవత్సరం చేస్తరు. మేం కూసుంటే అయితాది" అన్నది. 'కనికరం లేదు రాధ అత్తకు తన అత్తకు మల్లె' అనుకుంది సరళ!

'ఇంకో మూణ్ణెళ్ళు మీ అత్తనే చేస్కోమను! బరువులెత్తి తడినీళ్ళలో ఇంత పన్చేస్తే గర్భసంచీకి సంబంధించిన రోగాలు వస్తయ్.. తర్వాత


# సమర్థత, ఆకర్షణ, పనితనం వీటి మేటి కలయిక

# విజయ్

## మిక్సీలు



అత్యంత ఆకర్షణీయంగా రూపొందించబడినవి. దీర్ఘకాలం మన్నే విధంగా నిర్మించబడినవి. అత్యుత్తమంగా తీర్చిదిద్దబడినవి. మీ ఇంటి వంట ఇంటికి మిక్సీలు. అంతేకాదు, మిగిలిన అన్ని చోట్లకి.

**VM - 80 డీలక్స్**

- 3 ఉపయోగకరమైన జార్స్
- దీర్ఘకాలిక మన్నికకు నైలాన్ కప్లర్
- 500 శక్తివంతమైన మోటారు
- సున్నితమైన పనులకు అదనపు బ్లేడ్లు
- దీర్ఘకాలపు మన్నికకి ఆటోకట్ ఆఫ్

**VM - 94**

- స్టెయిన్‌లెస్ స్టీల్ జాడీలు
- ఓవర్ లోడ్ స్విచ్ - మోటార్ మీద ఓవర్ లోడ్ తొలగించడానికి
- నైలాన్ కప్లర్ - అరిగిపోకుండా మరియు బీటలు పడకుండా ఉండడానికి
- లాకింగ్ - మిక్సీకి జాడీని కదలకుండా బిగించడానికి
- అనేక రకాల పనులకు

Vijay®

a friend of your family




కష్టమవుతుంది నీకే.. మీ అత్తకు చెప్పు.' అంది సరళ కోపంగా.

అవమ్మా కడుపులో మస్తు నెప్పయితోంది!' అయినగని.. అంటూ నిస్సహాయపు చూపొకటి నిట్టూర్పుతో మేళవిస్తూ రాధ తలవంచుకుని అంట్లు రుద్దసాగింది.

తను? ఇంకా జ్వరం తగ్గని తను.. జ్వరంతోనే పన్చేస్తున్న తనా? రాధకు పన్లోకి రావద్దని-విశ్రాంతి తీస్కోమని సలహా ఇస్తోంది? ఎంత మానవత్వం లేని మనుషులు వీళ్ళు? అదే వీళ్ళు ఎవరైనా జబ్బు పడితే? పూర్తిగా బాగయిపోయినా విశ్రాంతి తీస్కుంటూనే వుంటారు. మొన్నటికి మొన్న అత్తమ్మ కాలు బెణికితే... బ్రష్‌మీద పేస్ట్‌వేసివ్వడం లెట్రిన్స్‌లో నీళ్ళు పెట్టడం.. వేస్కోవడానికి బట్టలివ్వడం వరకు.. రెణ్ణెల్లదాకా తనతోనే చేయించుకుంది.

ఈయనగారికి ఇంత జలుబు చేస్తే.. మూల్గుతూ పడుకుని వేడినీటి ఆవిర్లు జండూ బామ్ రాయించుకుంటారు. ఆడపడుచుకు ముట్టయితే.. ముల్లోకాలు ఏకం చేసేస్తుంది. వొప్పో తొప్పో అనుకుంటూ అంతా.. ఇల్లూ వాకిలీ ఏకం చేసి తనని హడావిడి పెట్టేస్తారు. అందర్కీ తనే చెయ్యాలి. తనకే? తననీ.. తన అనారోగ్యాన్ని మాత్రం పూచికపుల్ల కింద జమకడ్తారు తనకి జ్వరం వున్నట్టుగా కూడా గుర్తించనట్టు నటిస్తారు. ఏం మనుషులు వీళ్ళు? సరళ నీరసంగా బియ్యం ఏరడంలో మునిగిపోయింది చెయ్యవలసిన వంట తలుచుకుని ఆమెకి దుఃఖం వచ్చింది. మళ్ళీ దుఃఖానికి మించి ఆగ్రహం వచ్చేసింది.

తెల్లవారింది!

సరళకి చాలా నీరసంగా వుంది. నోరంతా చేదుగా వుంది. జ్వరం వుందేమోనని నుదుటిపై చేయి వేసుకుంది. వేడిగానే వుంది. థర్మామీటరు పెట్టుకుని చూసింది. నూట ఒకటి వుంది. నిన్నంతా పని చేసిందిగా.. దాని ఫలితం!

సురేష్ అప్పుడే లేచాడు. ఎలాగుందోయ్.. తగ్గిందా? బాగుందా? అని ప్రేమగా ఒంటిపై చేయి వేసి చూస్తాడనుకొంది. ఆశగా అతనివైపు చూసింది.

'ఏంటి ఇంకా పడుకున్నావు లే-తెల్లారింది' అంటూ గదిలోంచి వెళ్ళిపోతున్న సురేష్‌ను చూస్తూ నిస్త్రాణంగా కూచుండిపోయింది సరళ? 'తగ్గిందా? ఎలా వుంది? అని పలకరిస్తే ఏమవుతుంది? ఏమవుతుంది? ఏమవుతుందేం? పిచ్చి సరళా! తగ్గిందా అని అడిగి.. తను తగ్గలేదని చెప్తే.. ఎక్కడ ఇంటిపని తలకెత్తుకోవాలో.. తనూ.. తన తల్లి.. చెల్లి... ఎందుకనవసరంగా కమిట్ కావడం? అందుకే సురేష్ ఆ పొరపాటు చెయ్యడు. సరళకు వాళ్ళమ్మ గుర్తుకు వచ్చింది. కొద్దిగా ఒళ్ళు వెచ్చబడ్డా ఆప్యాయంగా నుదుటిపై చెయ్యివేసి తగ్గిందా లేదా చూసి తగ్గకపోతే అయ్యో తల్లి ఇంకా తగ్గనే లేదురా.. కదలకు పడుకో అనేది.. తన తల్లి.. మరిప్పుడు ఒదినతో.. తనత్త తనతో వున్నట్టే వుంటుందా? ఏమో.. అయినా.. అమ్మ మంచిది అలా చెయ్యదు అనుకుంది సరళ.

సరళ వంట చేస్తుందన్న మాటే కానీ.. చాలా నిస్సత్తువుగా వుంది. పొయ్యి మీద బియ్యం.. పప్పు పడేసి.. చింతపండు నానేసి.. నీరసాన్ని ఆపుకోలేక.. కళ్ళు తిరుగుతున్నట్లయ్యి గబగబ బెడ్రూంలోకొచ్చి పడుకుంది. కొద్దిగా నిమ్మళించాకా మళ్ళీ లేచి వంటింట్లో కెళ్ళింది. అన్నం కలిపి... కూరగాయలు తరిగిపోసేసింది. మళ్ళీ నిస్సత్తువుగా.. వాంతవుతున్నట్టు వికారంగా అన్పించింది. మెల్లగా బెడ్రూంలోకి వచ్చింది. ఈజీచెయిర్‌లో మేను వాల్చింది. ముఖమంతా చెమట్లు పట్టి నీరసంగా పడుకుని వున్న సరళని చూసి 'కొద్దిగా ఎలక్ట్రాల్ తాగకపోయావా?' అన్నాడు సురేష్ చేతిలో పేపర్ పట్టుకుని. సరళ అతనివైపు చిరాగ్గా, కోపంగా చూసింది. 'తాగి? శక్తి తెచ్చేస్కుని ఉత్సాహంగా మీకందరికీ సేవలు చేయాలి కదూ? ఎలక్ట్రాల్ తాగడం నా కోసమా మీ కోసమా? కాస్త చెబుతారా" సరళ వ్యంగ్యంగా అంది. దొంగలా పేపర్లో ముఖం దాచేశాడు సురేష్! అప్పట్నుంచి 'సరళ లేవడం' వంటింట్లోకెళ్ళడం పనిచెయ్యడం మళ్ళీ మధ్యమధ్యలో నీరసంగా వచ్చి పడుకోవడం చేస్తూనే వున్నది. అయినా గమనించనట్టు నటిస్తూ పేపర్ చదువుతున్నాడు. సరళకి అతనలా అడుగుతుంటే చీదరగా అనిపించింది.

సరళ మళ్ళీ వంటింట్లోకొచ్చిపడింది. శకుంతలమ్మ పెరట్లో కరివేపాకు కోసి పక్కింటి వర్ధమ్మకిస్తోంది. "బాగుందా ఒదినా మీ కోడలు? తగ్గిందా జ్వరం? పని చేస్తున్నట్లుందిగా" వర్ధనమ్మ వంటింట్లోకి తొంగిచూస్తూ అడుగుతోంది. "ఆ... తగ్గిందమ్మా... ఏదో నేను చేయబట్టి... అయినా నాకే బాగోలేకుండా అయిపోయిందమ్మా ఒకటే కాళ్ళు నొప్పులు" శకుంతలమ్మ లేని ఒళ్ళునొప్పుల నొప్పిని అనుభవిస్తున్నట్టుగా మొఖం పెట్టి చెబుతోంది. సరళ ఆగి ఆగి విశ్రాంతి తీస్కుంటూ చెయ్యలేక చెయ్యడం రెండ్రోజుల్నించీ గమనిస్తున్నా... గమనించట్లే వుంటోంది ఆవిడ!

పప్పు మరుగుతోంది. సరళకి కోపం ఎక్కువవుతోంది. నీర్సంగా మళ్ళీ మంచం ఎక్కింది. వంటింటి నించి బెడ్రూంలోకి... బెడ్రూంలోంచి వంటింట్లోకి నడవలేక నీరసం ఎక్కువవుతోంది. జ్వరం పూర్తిగా తగ్గేదాకా... ఇలా చేస్తుండాల్సిందే... అమ్మో... సరళకి అసహనంగా వుంది. పోయినేడాది మలేరియా వచ్చినప్పుడు

## చెదిరిన స్వప్నం

'మధు'శ్రీ

వంద సంవత్సరాల పాటు
శత్రువుతో పోరాడి నాటిన విత్తు
1947లోనే చిట్లింది
స్వాతంత్రపు కుండీలో
వేయి రేకుల వేకువై విస్తరించాలన్న వృక్షం
పదుగురికీ నీడనిస్తూ ఫల పుష్పాలు అందిస్తుందని
మనో మూలాల్లో
ఆప్తకాలం పాటు
ఆశల రెమ్మలు రంగులద్దుకుంది

గాలి గాయపడింది
యాభై ఏళ్ళలోపే
గుండెకు గండి పడింది

వేర్లను పురుగులు తొలుస్తాయనుకోలేదు.
ఎగిరిన పక్షుల్లా చెదిరిన స్వప్నాలు
కాపు కాసినంత మేర
ఏ.కె 47లు, ఆర్.డి ఎక్స్‌లు
కుటిల కుతంత్రపు నాయకుల మాయా జాలం
అందుకో
చీడ పట్టిన వృక్షాన్ని
క్రిమి సంహారక మందులో ముంచి తీద్దాం
వృక్షాన్ని రక్షించుకుందాం.

ఇదే ప్రహసనం! ఛ! ఏం మనుషులు వీళ్ళు??

"ఇదిగో... ఓ కప్పు టీ ఇయ్యవోయ్" అంటున్నాడు సురేశ్! తీరిగ్గా ఈజీ ఛెయిర్‌ల కూర్చుని... పేపరు చదువుతున్న భర్త... కులాసాగా వర్ధనమ్మతో పెరట్లో కబుర్లు చెబుతున్న శకుంతలమ్మ... పొద్దున్నే... జీ టీవిలో బట్టిలిప్పకుని డాన్సులు చేస్తున్న డాన్సర్లను ఆరాధనతో చూస్తున్న ఉమ... ఇంకా నిద్రే లేవని మరిది రవి... తీరిగ్గా గడ్డం గీస్కుంటున్న మామగారు... వీళ్ళు మనుషులేనా? సరళ మథనపడసాగింది. నాకు జ్వరంగా వుంది... నీరసంగా వుంది... నాకు విశ్రాంతి కావాలి... నన్ను పడుకోనివ్వండి... మీ పనులు మీరే చేస్కోండి... అని ఎలుగెత్తి అరవాలని వుంది సరళకి... అరిస్తే వూరుకుంటారా వీళ్ళు?? వీళ్ళందర్కీ తెల్సు తనకసలు బాగోలేదని. తెల్సినవాళ్ళకి చెప్పగలమా?

వంటింటి గడపకానుకుని నీర్సంగా నిల్చుంది. నిల్చోలేక గ్లాసులో ఎలక్ట్రాల్ కలుపుకుని తాగింది. చపాతీలు... టమాట పచ్చడి చెయ్యాలి ఇంకా... తనకి ఓపికలేదు. అయినా తప్పదు. సురేశ్‌కి చపాతీ లేనిది ముద్ద దిగదు. పిండి కలిపి అవి ఒత్తే శక్తి తనకు లేదు అయినా తప్పదు. శక్తినంతా కూడ దీస్కుని చపాతి పిండి కల్పింది సరళ! కొద్దిసేపు పడుకుని వద్దాం అనుకుంటూ సరళ బెడ్రూం వైపుకి నడుస్తోంది. ఈ లోపల తోమిన అంట్లను లోపల వేద్దామని రాధ అంట్ల గుల్ల లోనికి తెస్తూ తలుపు పక్కనే ఉన్న నులక మంచానికి తట్టుకుంది. ఒక రవ్వంత చీర చిరిగింది.

"ఈ నులక మంచం ఈడ్చించి తియ్యండమ్మ" రాధ అంటోంది. బెడ్రూం వైపు వెళ్తున్న సరళ ఆగిపోయింది. నులక మంచం! బెడ్రూంలోకి ఎందుకు వెళ్ళి పడుకోవడం? ఈ నులక మంచాన్నే వంట గదిలో వేస్కుని కావాల్సినప్పుడల్లా అక్కడే ఒరుగుతూ... విశ్రాంతి తీస్కుంటూ వీళ్ళకి... ఈ రోగగ్రస్తులకి... పరాన్నజీవులకి వంటచేసి పెట్టచ్చు! వీళ్ళకిలాగే బుద్ధి చెప్పాలి. కనీస మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్న వీళ్ళని సిగ్గుపడేలా చేయాలి సరళ స్థిరంగా అనుకుంది.

"రాధా! కొద్దిగా సాయం పట్టు మంచం వంటింట్లో వేద్దాం!" అంటున్న సరళతో "వంటింట్లో ఎందుకమ్మా"... అంటూ ఆశ్చర్యపోతూనే సాయం చేసింది రాధ! సరళ వెళ్ళి దుప్పటీ... దిండూ తన మందులు ఎలక్ట్రాల్ పాకెట్లూ అన్నీ తీస్కుని వంటింట్లోకొచ్చి మంచం పక్కనే వున్న స్టూలుపైన చక్కగా సర్దుకుంది. మంచంపై ఒరిగింది. కూరింకా కాలేదు. పచ్చడికి టమాటాలు మగ్గుతున్నాయి. ఇంకా చపాతీలు చేసి భర్తకి, రవికి టిఫిన్లు సర్దాలి. వంటింట్లో నులకమంచం వేయించుకుని పడుకున్న సరళని బిత్తరపోయి చూస్తోంది రాధ... ఏదో అర్థం అయ్యీ అవ్వనట్లు వుంది రాధకి.

ఈ లోపల "సరళా టీ" అంటూ సురేశ్... "రావమ్మా వర్ధనమ్మా... కొద్దిగా టీ తాగి పోదూ కానీ" అంటూ శకుంతలమ్మా అటువేపోదో

"రెండు మేకల్ని దొంగిలించావని
నీ మీద కేసుపెట్టారా?
నీ కేసు వాదిస్తే నాకేమిస్తావ్?"
అడిగాడు లాయర్.
"దొంగిలించిన మేకల్లో ఒకటి
ఇచ్చుకుంటానండి" చెప్పాడతను.

– గుగ్గిలం శ్రీహరి




పనుండి వచ్చిన ఉమ అంతా... వంటింట్లో నులక మంచంపై నీర్సంగా పడుకుని వున్న సరళను చూసి విద్యుత్‌ఘాతం తగిలినట్టే షాక్ తిన్నారు. ఇంకో పక్క పొయ్యిపై కూర- కుత కుత మరుగుతోంది.

"ఏంటీ... వంటింట్లో నులక మంచం ఎందు కేశావ్?" సురేశ్ కోపంగా... పెద్దగా అరిచాడు.

"ఎందుకా...? నీరసంతో చచ్చిపోతున్నాను. వంటంతా అయ్యేదాకా వంటింట్లో వండటం నావల్ల కావట్లేదు. అలాగని మధ్యమధ్యలో బెడ్రూంలోకొచ్చి పడుకోవడం ఒక ప్రయాసగా వుంటోంది. అందుకే ఇక్కడ వేస్కున్నాను. నీరసం ఎక్కువయ్యి కళ్ళు తిరిగినప్పుడల్లా ఇక్కడే పడుకుంటూ మీకు వంట చేసి పెట్టచ్చని" సరళ కచ్చగా అంది.

వర్ధనమ్మ గాభరాగా "వెళ్తొస్తానండీ... మళ్ళీ వస్తా" అంటూ వెళ్ళిపోయింది. రాధా ఆమె వెంటే వెళ్ళిపోయింది నవ్వుకుంటూ!

"మా పరువు తీస్తున్నావ్ కదే.. బాగాలేదత్తా ఇంకో రెండ్రోజులు పడుకుంటా అంటే... నీ కిరీటం పడిపోతుందా?" శకుంతలమ్మ అరుస్తోంది. ఉమ ముఖం మటమటలాడించింది.

సురేశ్ ముఖం సిగ్గుతో ఎర్రబడ్డది.

"పద... విశ్రాంతి తీస్కుందుగానీ"... సురేశ్ మెలగా సరళ [illegible] పొదివి పట్టుకుని బెడ్రూం వైపు తీస్కెళ్ళాడు.




